సాక్షి
తూర్పుగోదావరి
సోమవారం । 20 । ఫిబ్రవరి । 2023



స్వామి ఊరేగే.. మది ఉప్పొంగే

హరహరా.. భీమేశ్వరా అంటూ ఆ స్వామిని చూసిన భక్తజనం పులకించింది.. భక్తిపార వశ్యంతో మునిగితేలింది.

- వివరాలు 8లో▸




ఏం జరిగిందో.. ఏమో!

పెద్దాపురం మండలం వాలుతిమ్మాపురం రోడ్డులోని ఓ పరిశ్రమలో ఒక కార్మికుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు.

- వివరాలు 8లో▸

డెల్టాలకు 6,895 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 6,895 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,030, మధ్య డెల్టాకు 1,325, పశ్చిమ డెల్టాకు 3,540 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7.60 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

వ్రత విభాగంలో అవకతవకలపై విచారణ

అన్నవరం: అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం వ్రతాల విభాగంలో పూజా ద్రవ్యాల వినియోగంలో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై సన్నిధి విభాగం సూపరింటెండెంట్ ఐవీ రామారావు ఆదివారం విచారణ చేపట్టారు. వ్రతాల నిర్వహణలో భాగంగా భక్తులకు దేవస్థానం కొన్ని పూజా ద్రవ్యాలను అందజేస్తుంది. వ్రతాల గావంచా మీద వేసే బియ్యం, దీపం వెలిగించే నూనె, అగర ఒత్తులు, హారతి కర్పూరం, కలశంపై పెట్టే జాకెట్టు తదితరాలు నిర్దిష్ట పరిమాణంలో అందజేయాలి. అలా ఇవ్వకుండా సగం సగం మాత్రమే సరఫరా చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సూపరింటెండెంట్ ఐవీ రామారావును ఈఓ సత్యనారాయణ మూర్తి ఆదేశించారు. ఈ మేరకు ఆ విభాగంలోని ఆరుగురు ఉద్యోగులను విచారించి వారి వాదనను రామారావు రికార్డు చేశారు. అదే విధంగా ఆరోపణలు చేసిన వ్యక్తులను కూడా విచారించి వారి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించినట్లు ఆయన 'సాక్షి'కి తెలిపారు. ఈ నివేదికను సోమవారం ఈఓకు అందజేస్తానన్నారు. దీని ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఈఓ సత్యనారాయణమూర్తి వెల్లడించారు.

కోటసత్తెమ్మకు రూ.1,25,811 ఆదాయం

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారికి దర్శనాలు, ప్రసాదం విక్రయాలు, ఇతర రూపాల్లో ఆదివారం రూ.1,25,811 ఆదాయం సమకూరింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అమ్మవారికి ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేసి, విశేష పూజలు నిర్వహించినట్టు ఈఓ బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు. భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు.

లోవకు భక్తుల తాకిడి



లోవ ప్రాంగణంలో చెట్ల కింద వంటలు, భోజనాలు చేస్తున్న భక్తులు

తుని రూరల్: తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భారీగా భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆరు వేల మంది భక్తులు బాలాలయంలో అమ్మవారిని దర్శించుకున్నట్టు కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల ద్వారా రూ.66,330, పూజా టికెట్లకు రూ.31,120, కేశఖండన శాలకు రూ.2,725, వాహన పూజలకు రూ.3,410, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెల కింద రూ.33,100, దాతల విరాళాలుగా రూ.37,781 ఆదాయం సమకూరిందని వివరించారు.

వెంకన్నకు కిలో వెండి సమర్పణ



దాతలకు స్వామివారి చిత్రపటం బహూకరిస్తున్న ఆలయ చైర్‌పర్సన్ వీరీతాదేవి, ధర్మకర్తలు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వర ఆలయంలో స్వామివారికి కోశే వేంకట సాయిశ్రీ విశ్వనాథ్ దంపతులు (హైదరాబాద్) ఆదివారం కిలో వెండి, నిత్యాన్నదానానికి రూ.10 వేల నగదు విరాళంగా సమర్పించారు. వీటిని ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవికి ఆదివారం అందజేశారు. దాత దంపతులకు వీరీతాదేవి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈఓ దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

కిక్కిరిసిన విఘ్నేశ్వరుని ఆలయం



అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ప్రధానార్చకుడు వినాయకరావు ఆధ్వర్యాన స్వామివారికి విశేష పూజలు చేశారు. స్వామి వారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీ గణపతి హోమంలో భక్త దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నూతన వాహనాలకు పూజలు చేయించుకున్నారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.11 వేలు, అన్నదానానికి విరాళాలుగా రూ.56 వేలు, వివిధ సేవలకు రూ.9 వేలు, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.21 వేలు, వివిధ విరాళాలుగా రూ.10 వేల చొప్పున ఆదాయం సమకూరిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

ఆక్వా.. వహ్వా..

- జోనేషన్ విధానం అమలు
- తద్వారా మరింతగా విస్తరణకు మత్స్యశాఖ ప్రణాళికలు
- నాన్ ఆక్వా జోన్ భూములను జోన్‌లోకి తీసుకువచ్చేందుకు చర్యలు
- తద్వారా రైతులకు మేలు

సాక్షి, రాజమహేంద్రవరం: ఆక్వా రంగాన్ని ప్రోత్సహించేందుకు, రైతులకు మరింత అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా జోనేషన్ విధానాన్ని అమలు చేస్తోంది. ఆక్వా జోన్ పరిధిలోని రైతులకు ఇప్పటికే సబ్సిడీపై విద్యుత్ అందజేస్తున్న విషయం తెలిసిందే. జోన్‌లో లేని వారిని సైతం ఇందులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకుగాను క్షేత్ర స్థాయిలో మత్స్య, విద్యుత్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యాన సర్వే నిర్వహించింది. ఆక్వా సాగు విస్తీర్ణం, రైతుల వివరాలు, విద్యుత్ వినియోగం తదితర సమగ్ర వివరాలను 'ఈ-ఫిష్' యాప్‌లో నమోదు చేసింది. సర్వే ప్రారంభించిన మత్స్యశాఖ అధికారులు ఇంకా నమోదు చేసుకోని రైతులకు జోనేషన్ విధానంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఆక్వా సాగు చేపట్టే ప్రతి రైతునూ జోన్ పరిధిలోకి తీసుకు వచ్చేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. సర్వే, జోన్‌లో నమోదయ్యే భూముల వివరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైపవర్ కమిటీకి ఇప్పటికే సమర్పించారు. కమిటీ ఆమోద ముద్ర వేసిన అనంతరం గెజిట్ నోటిఫికేషన్ వెలువరించనున్నారు. తద్వారా ప్రతి రైతుకూ సబ్సిడీపై విద్యుత్ అందించాలన్న ప్రభుత్వ ఉద్దేశం నెరవేరనుంది.

జోన్ పరిధిలో 400 ఎకరాలే..

జిల్లాలో ఆక్వా రంగంపై ఆధారపడి 1,500 మందికి పైగా రైతులు జీవనం సాగిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 3 వేల ఎకరాల్లో ఆక్వా (చేపలు, రొయ్యలు) సాగు జరుగుతోంది. ఇందులో అధికారికంగా 2,270 ఎకరాలు ఉంది. వీటన్నింటికీ మొత్తం విద్యుత్ కనెక్షన్లు 1000 ఉన్నాయి. అధికారిక సాగు విస్తీర్ణంలో 400 ఎకరాలు మాత్రమే ఆక్వా జోన్ పరిధిలో ఉన్నాయి. వీటిలో సబ్సిడీ విద్యుత్ అందుకుంటున్న సర్వీసులు 150 ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మిగిలిన వాటిని కూడా జోన్ పరిధిలోకి తీసుకువచ్చేందుకు మత్స్యశాఖ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనివలన రైతులకు ఎంతో మేలు జరగనుంది. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ వలన హెక్టారు చెరువుకు నెలకు రూ.22 వేల వరకూ విద్యుత్ బిల్లు ఆదా అవుతుంది. అదే జోన్ పరిధిలో లేని చెరువులకు కేవలం రూ.8 వేలు మాత్రమే మిగులుతుంది.

విద్యుత్ సబ్సిడీ ఇస్తున్నారిలా..

ఆక్వా రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల్లో రాయితీ ఇస్తోంది. పదెకరాల్లోపు, పదెకరాలకు పైబడి సాగు చేస్తున్న వారిగా విభజించి సబ్సిడీ ఇస్తోంది. గతంలో నాన్ జోన్ పరిధిలోని చెరువులకు యూనిట్ విద్యుత్ రూ.6.40కి ఇచ్చేవారు. దానిని ప్రభుత్వం రూ.3.85కు తగ్గించింది. ఆక్వా జోన్ పరిధిలో ఉన్న సాగుదార్లకు మాత్రం రూ.1.50కే సరఫరా చేస్తోంది.



పేరవలిలో ఆక్వా సాగు

నమోదు ఇలా..

ఆక్వా జోన్ పరిధిలోకి రావాలంటే తొలుత ఈ-ఫిష్‌లో నమోదవ్వాలి. ఈ ప్రక్రియ జిల్లాలో వేగవంతంగా నడుస్తోంది. పదెకరాల్లోపు విస్తీర్ణం కలిగిన రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులు. ఆక్వా సాగు చేసే పరిధిలోని సచివాలయంలో మత్స్యశాఖ ఉద్యోగి ద్వారా నమోదు చేసుకోవాలి. సాగు విస్తీర్ణ ధ్రువీకరణ పత్రాలు, సర్వే నంబర్, విద్యుత్ సర్వీస్ నంబర్, ఆధార్ కార్డు, మత్స్యశాఖ జారీ చేసిన లైసెన్స్, కార్డు సమర్పించాలి.

వెయ్యి ఎకరాలు ప్రతిపాదించాం



ఆక్వా సాగు చేస్తున్న ప్రతి రైతుకూ విద్యుత్ సబ్సిడీ అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. అందుకు అనుగుణంగా ఆక్వా జోన్ పరిధిలోకి రాని రైతులను అందులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం. జోనేషన్ వలన రైతులకు కలిగే ప్రయోజనాలను గ్రామసభల ద్వారా వివరిస్తున్నాం. జోన్‌లోకి కొత్తగా మరో వెయ్యి ఎకరాలు తీసుకువచ్చేందుకు మంత్రి సారథ్యంలోని హైపవర్ కమిటీకి ప్రతిపాదించాం. కమిటీ నిర్ణయం అనంతరం విద్యుత్ సబ్సిడీ అందజేస్తాం.

- బి.కృష్ణారావు, ఫిషరీస్ జేడీ

సీలేరు నుంచి గోదావరికి అదనపు జలాలు

- 3 వేల క్యూసెక్కుల విడుదల
- జెన్‌కో ఎస్ఈ వెల్లడి

సీలేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉభయ గోదావరి జిల్లాల్లోని పంట భూములకు అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ నుంచి ఆదివారం రాత్రి 7 గంటలకు అదనపు నీటిని విడుదల చేశారు. ఈ విషయాన్ని ఏపీ జెన్‌కో ఎస్ఈ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. రబీ పంటకు అత్యవసరంగా నీటి విడుదల విషయమై నాలుగు రోజుల క్రితం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇరిగేషన్, జెన్‌కో అధికారులతో సమావేశం నిర్వహించారన్నారు. పంటలకు నీటి ఎద్దడి లేకుండా సకాలంలో సరఫరా చేయాల్సిందిగా ఆదేశించినట్టు చెప్పారు. ఈ మేరకు సీలేరు కాంప్లెక్స్ డొంకరాయి మెయిన్ డ్యాం నుంచి విద్యుత్ ఉత్పత్తితో సంబంధం లేకుండా గోదావరి డెల్టాకు నేరుగా 3 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని ఆయన వివరించారు. ఇరిగేషన్ అధికారుల ఆదేశాలతో వారం రోజుల పాటు సాగునీరు విడుదల చేస్తామని చెప్పారు. దీంతో పాటు విద్యుత్ ఉత్పత్తి ద్వారా మరో 4,300 క్యూసెక్కుల నీరు కూడా డెల్టాకు అందుతుందన్నారు. కాంప్లెక్స్‌లో 8 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు.

బాలికకు భరోసా



ఎంపీ భరత్‌రామ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న మాధురి తల్లిదండ్రులు భాను, రాజేష్

- తలసేమియా బాధితురాలి శస్త్రచికిత్సకు రూ.15 లక్షలు
- సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం

రాజమహేంద్రవరం రూరల్: తలసేమియా వ్యాధితో బాధ పడుతున్న శాటిలైట్ సిటీకి చెందిన ఐదేళ్ల బాలిక మాధురి శస్త్రచికిత్సకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.15 లక్షలు మంజూరు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిధులు మంజూరు చేస్తూ సీఎం ప్రత్యేక కార్యదర్శి ఎం.హరికృష్ణ నుంచి మాధురి తల్లిదండ్రులు చిట్లూరి భాను, రాజేష్‌లకు సమాచారం అందింది. దీంతో వారు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. తమకు ఎంతో సహకరించిన ఎంపీ మార్గాని భరత్‌రామ్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకు స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఆయన కార్యాలయానికి ఆదివారం వచ్చారు. తమకు ఎంతో సహాయం చేశారంటూ ఉద్వేగంతో కన్నీరు పెట్టుకున్నారు. వారిని ఓదార్చిన ఎంపీ భరత్ చిన్నారి మాధురిని ఆశీర్వదించారు.

సీఎం వద్దకు తీసుకువెళ్లారు

మాధురికి సరిగ్గా ఇదే వయసులో ఆపరేషన్ చేయాల్సిందిగా వైద్యులు సూచించారని తల్లిదండ్రులు భాను, రాజేష్ మీడియాకు తెలిపారు. ఆపరేషన్‌కు రూ.20 లక్షలు ఖర్చవుతుందన్నారని, అంత సొమ్ము భరించే స్తోమత తమకు లేదని అన్నారు. ఫేస్‌బుక్‌లో ఎంపీ భరత్‌రామ్‌ను అభ్యర్థించామని, అది చూసిన ఆయన వెంటనే తన కార్యాలయానికి రావాల్సిందిగా తెలిపారని, అదే రోజు అధికారులతో మాట్లాడారని చెప్పారు. జనవరిలో సీఎం జగన్ రాజమహేంద్రవరం వచ్చినప్పుడు తమను ఎంపీ భరత్ స్వయంగా తీసుకువెళ్లి మాధురి పరిస్థితిని వివరించారని తెలిపారు. అదే రోజు పావు గంటలోనే తమ పాప వివరాలు తెలియజేయడం, సీఎంఆర్ఎఫ్ మంజూరు కావడం సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. రూ.లక్ష ఇచ్చి ఆదుకోవడానికి దగ్గరి బంధువులే వెనకడుగు వేస్తున్న ఈ రోజుల్లో తమ బిడ్డ ఆపరేషన్‌కు ఏకంగా రూ.15 లక్షలు మంజూరు చేయించారని, ఒక్క పైసా తమ చేతిది పడకుండా వైద్యం చేస్తారని ఎంపీ భరత్ చెప్పడం చాలా సంతోషంగా ఉందని తల్లిదండ్రులు చెప్పారు.

ప్రసాదమెక్కడ స్వామీ...

- ఊరిస్తున్న కేంద్ర ప్రభుత్వ 'ప్రసాద్' స్కీమ్
- రత్నగిరిపై రూ.54 కోట్ల పనులకు నివేదిక
- కీలకమైన దశలు దాటిన పథకం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సంతకం కోసం నిరీక్షణ

అన్నవరం: 'ప్రయాణం పూర్తయింది. దిగాల్సిన రైలు రైల్వే స్టేషన్ సమీపానికి చేరుకుంది. ఎదురుగా స్టేషన్ కూడా కనిపిస్తోంది. కానీ ఔటర్‌లో నిలిచిపోయిన రైలుకు ఎంతకూ సిగ్నల్ మాత్రం రావడం లేదన్న' చందాన ప్రసాద్ స్కీమ్ పరిస్థితి ఉంది. అన్నవరంలోని వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి కేంద్రం మంజూరు చేసిన ఈ పథకం కోసం ఇంకా నిరీక్షణ కొనసాగుతోంది. దేవస్థానం ప్రతిపాదనలపై సుమారు మూడేళ్లు వివిధ దశలలో సమీక్షలు, సమావేశాల తరువాత ఈ స్కీమ్ ద్వారా రూ.54 కోట్ల మంజూరుకు కేంద్ర టూరిజం శాఖ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ఇది జరిగి ఐదు నెలలైనా ఇంకా ఆదేశాలు వెలువడం లేదు. సంబంధిత ఫైల్ కేంద్ర టూరిజం శాఖా మంత్రి జి.కిషన్‌రెడ్డి వద్ద పెండింగ్‌లో ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రసాద్ స్కీం మంజూరుకు కాకినాడ ఎంపీ వంగా గీత ఢిల్లీ స్థాయిలో, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ రాష్ట్ర స్థాయిలో తీవ్ర ప్రయత్నాలు చేశారు.

మూడేళ్లుగా ఎదురుచూపులు

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చాక ప్రముఖ పుణ్యక్షేత్రాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు పిలిగ్రిమేజ్ రీజువెనేషన్ అండ్ స్పిరిట్యువల్ అగ్మంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) స్కీమ్ ఏర్పాటు చేసింది. తొలి దశలో ఉత్తరాది రాష్ట్రాల్లోని వారణాశి, మధురై తదితర ప్రముఖ పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేశారు. రెండో దశలో రత్నగిరి సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి ప్రసాద్ నిధుల మంజూరుకు ప్రతిపాదనలు కోరారు. దీనిపై దేవస్థానం అధికారులు రూ.96 కోట్లకు ప్రతిపాదనలు రూపొందించి రాష్ట్ర టూరిజం శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. ఈ ప్రతిపాదనలపై మూడేళ్లుగా కేంద్ర, రాష్ట్ర టూరిజం శాఖ ఉన్నతాధికారులతో పాటు కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్, అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓలతో సమావేశాలు నిర్వహించారు. ఇందులో భాగంగా దేవస్థానానికి అత్యంత అవసరమైన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుని రూ.54 కోట్లకు డైరెక్ట్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారు చేశారు. దీనిపై రాష్ట్ర టూరిజం శాఖ, అన్నవరం దేవస్థానం అధికారులు అంగీకరించారు. కేంద్ర టూరిజం శాఖ అధికారులు తుది నివేదిక రూపొందించి గతేడాది సెప్టెంబర్‌లో కేంద్ర పర్యాటక శాఖా మంత్రి కిషన్‌రెడ్డి ఆమోదానికి పంపించారు. అక్కడ పెండింగ్‌లో పడిందని అధికారులు వివరిస్తున్నారు.



ప్రసాద్ స్కీం లోగో

ఏం కుదించారంటే..

ప్రసాద్ స్కీమ్ తుది నివేదికలో రూ.30 కోట్లతో ప్రకాశ్‌సదన్ సత్రం వెనుక మూడంతస్తుల అన్నదాన భవనం, టీటీడీ సత్రం స్థలంలో మూడంతస్తుల వ్రత మండపం నిర్మాణాలను యథాతథంగా కొత్త డీపీఆర్‌లో ఉంచారు. కొండ దిగువన డార్మెట్రీ, వనదుర్గ ఆలయం నుంచి మొదటి ఘాట్‌రోడ్‌ను కలుపుతూ రింగ్ రోడ్, వ్రత మండపం నుంచి సత్యదేవుని ఆలయం వరకూ భక్తుల నడక దారి అభివృద్ధి వంటి నిర్మాణాల్లో ఎస్టిమేట్స్ కుదించారు. తొలుత ఈ పనులకు రూ.20 కోట్ల అంచనా వేయగా దానిని రూ.పది కోట్లకు తగ్గించారు. రూ.8.5 కోట్లతో కొండ దిగువన రెండు బ్లాకులుగా నిర్మించనున్న డార్మెట్రీని ఒక బ్లాక్‌కే పరిమితం చేశారు. అదే విధంగా వనదుర్గ ఆలయం నుంచి మొదటి ఘాట్‌రోడ్ వరకూ రింగ్ రోడ్ నిర్మాణ వ్యయాన్ని కూడా తగ్గించారు. దీంతో పాటు భక్తులు క్యూలో అరగంట కన్నా ఎక్కువ సమయం నిలబడకుండా టీటీడీ తరహాలో కంపార్ట్‌మెంట్స్ ఏర్పాటు చేయడం, అన్నదానంలో మెకనైజ్డ్ కుకింగ్, భక్తుల కోసం బ్యాటరీ కార్లు తదితర సదుపాయాలు కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇవన్నీ ప్రసాద్ స్కీం తుది నివేదిక ప్రకారం రూ.54 కోట్లతోనే చేయాలని కార్యాచరణ చేశారు. దీనికి అనుమతులు ఇవ్వాలని కోరుతూ 2021 డిసెంబర్‌లో ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత, దేవస్థానం అధికారులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిశారు.

దేవస్థానం అభివృద్ధికి అవకాశం



కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీం కింద త్వరగా నిధులు మంజూరైతే అన్నదాన భవనం, వ్రత మండపాల నిర్మాణం చేపట్టే అవకాశం ఉంటుంది. మిగిలిన అభివృద్ధి పనులూ చేపట్టవచ్చు. దీనివల్ల భక్తులకు మరిన్ని సౌకర్యాలు ఒనగూరుతాయి. సాధ్యమైనంత త్వరగా మంజూరు కావాలని కోరుకుంటున్నా. ఆ మేరకు ప్రయత్నాలు చేస్తున్నాం.

- సత్యనారాయణ మూర్తి, ఈఓ, అన్నవరం దేవస్థానం

ఏ క్షణమైనా తుది ఉత్తర్వులు



కేంద్ర టూరిజం శాఖ ఉన్నతాధికారులు తెలిపిన సమాచారం మేరకు ఏ క్షణమైనా ప్రసాద్ స్కీం డీపీఆర్‌పై తుది ఉత్తర్వులు రావొచ్చు. దీనిపై సంప్రదింపులు జరుపుతున్నాం. కేంద్ర టూరిజం శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వద్ద ఫైల్ ఉందని చెబుతున్నారు. కేంద్ర బడ్జెట్ సమావేశాల కారణంగా ఆలస్యమైందని అంటున్నారు. ఎంపీ వంగా గీత కూడా దీనిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో మాట్లాడినట్టు తెలిపారు.

- సీఎస్ఎన్ మూర్తి, సీఈ, ఏపీ టూరిజం

తెలుగు అబ్బాయి.. ఫ్రాన్స్ అమ్మాయి

తెలుగు సంప్రదాయ రీతిలో వైభవంగా వివాహం



సుమంత్, క్లమెన్‌టైన్ దంపతులను ఆశీర్వదిస్తున్న తల్లిదండ్రులు

యానాం: ఖండాలు దాటినా తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను మరువలేదు ఆ కుటుంబం. ఫ్రెంచి జాతీయత కలిగిన వారిద్దరికీ తెలుగు సంప్రదాయ రీతిలో వివాహం ఘనంగా జరిగింది. కేంద్ర పాలిత ప్రాంతం యానాం పట్టణానికి చెందిన చింతా వెంకట్ కుటుంబం ఎన్నో ఏళ్ల క్రితం ఫ్రాన్స్ దేశంలో స్థిరపడ్డారు. చింతా వెంకట్, వేద దంపతుల కుమారుడు సుమంత్ ఫ్రాన్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అదే దేశానికి చెందిన యువతి క్లమెన్‌టైన్‌తో అతడికి వివాహం కుదిరింది. ఈ వివాహాన్ని కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో స్వస్థలం యానాంలో చేయాలని నిర్ణయించారు. దీంతో హిందూ సంప్రదాయ రీతిలో స్థానిక గాజుల గార్డెన్స్ కల్యాణ మండపంలో సుమంత్, క్లమెన్‌టైన్‌ల వివాహం ఆదివారం అంగరంగవైభవంగా జరిగింది. వధూవరులను యాంకర్ సుమ, రాజీవ్ కనకాల దంపతులు, బంధుమిత్రులు ఆశీర్వదించారు.

నందనవనంలా..

- జోరుగా కంబాలచెరువు అభివృద్ధి రూ.10 కోట్లతో.. రెండు దశల్లో పనులు
- మొదటి దశలో రూ.5 కోట్లతో వివిధ నిర్మాణాలు
- రెండో దశలో మరో రూ.5 కోట్లతో పలు ఆకర్షణలు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా కేంద్రం రాజమహేంద్రవరం నగర వాసులకు ఆహ్లాదాన్ని పంచే కంబాలచెరువు పార్కును నందనవనంలా తీర్చిదిద్దే పనులు చురుకుగా సాగుతున్నాయి. దీనిని అత్యంత రమణీయ ఉద్యానవనంగా తీర్చిదిద్దేందుకు రూ.10 కోట్లతో నగరపాలక సంస్థ అధికారులు చకచకా పనులు నిర్వహిస్తున్నారు. మొత్తం 10.23 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ పార్కును నగరానికే తలమానికంగా తయారు చేయనున్నారు. కంబాలచెరువు పార్కును మొత్తం రూ.10 కోట్ల వ్యయంతో రెండు దశల్లో అభివృద్ధి చేస్తున్నారు.

ఆకట్టుకునే నిర్మాణాలు

- మొదటి దశ పనులను రూ.5 కోట్లతో చేపట్టారు. ఇందులో ప్లే కోర్టులు, జాగింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, ఫుట్‌పాత్‌లు, మల్టిపుల్ ఎంట్రీ ప్లాజా, లేజర్ షో, సిటింగ్ సిస్టమ్ వంటివి ఏర్పాటు చేస్తున్నారు.
- చెరువు చుట్టూ రెండు మీటర్ల వెడల్పున ఫుట్‌పాత్ నిర్మిస్తారు.
- రెండో దశలో మరో రూ.5 కోట్లు వెచ్చించి, లోటస్ డెస్క్‌కు వెళ్లేందుకు అద్దాల వంతెన (గ్లాస్ బ్రిడ్జి), చిన్న పిల్లల ఆటస్థలం, నీతి కథలు తెలిపే గార్డెన్, స్టాట్యూ ఫ్రైడ్ జోన్ నిర్మిస్తారు.
- గ్లాస్ బ్రిడ్జిని 2 మీటర్ల వెడల్పు, 14 మీటర్ల పొడవున నిర్మించనున్నారు.
- 3.3 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణాలు చేపడుతుండగా.. మిగిలినది చెరువుకు వదిలేశారు. చెరువులో 145 మీటర్ల కేబుల్ బ్రిడ్జి నిర్మించనున్నారు.
- పార్కులో 41 ఫుడ్ స్టాల్స్ కూడా ఏర్పాటు చేస్తారు.
- ఈ పనులన్నీ పూర్తయితే సాయంత్రం వేళల్లో నగర ప్రజలకు ఉల్లాసాన్ని కలిగించేలా కంబాల చెరువు పార్కు సర్వాంగసుందరంగా ముస్తాబు కానుంది.
- కంబాలచెరువు పార్కు పక్కనే ఉన్న వివేకానంద సర్కిల్‌ను కూడా అందంగా తీర్చిదిద్దుతున్నారు. కంబాలచెరువు జంక్షన్, పేపరు మిల్లు, కోరుకొండ రోడ్ల కూడలిగా ఉన్న ఈ సర్కిల్ అభివృద్ధి పనులు కూడా పూర్తయితే ఈ ప్రాంతం నగరానికే మణిహారంగా భాసించనుంది.



కంబాలచెరువులో జరుగుతున్న అభివృద్ధి పనులు



అభివృద్ధి అనంతరం కంబాలచెరువు ఊహాచిత్రం

జూన్ నాటికి పూర్తి



కంబాలచెరువు పార్కు అభివృద్ధి పనులు శరవేగంగా చేపట్టాం. మొదటి దశ నిర్మాణాలు జూన్ నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేశాం. అన్ని వర్గాల వారినీ ఆకట్టుకునేలా ఈ పార్కు సిద్ధం కానుంది.

- పాండురంగారావు, ఎస్ఈ, నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

తైక్వాండో పోటీలు ప్రారంభం



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా ఒలింపిక్ సంఘు కార్యదర్శి పద్మనాభం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని జిల్లా ఒలింపిక్ సంఘు కార్యదర్శి కె.పద్మనాభం అన్నారు. ఆదివారం తైక్వాండో సంఘం ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సబ్ జూనియర్స్ స్థాయి తైక్వాండో పోటీలు జరిగాయి. దీనికి తైక్వాండో సంఘు కార్యదర్శి బి.అర్జునరావు అధ్యక్షత వహించారు. ఈ పోటీలను పద్మనాభం ప్రారంభించి మాట్లాడుతూ ఆత్మరక్షణకు తైక్వాండో వంటి క్రీడలు ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. 188 మంది క్రీడాకారులు హాజరు కాగా, సబ్ జూనియర్స్ క్యాడెట్ విభాగంలో 18 కిలోల నుంచి 45 కిలోల విభాగాలకు పోటీలు జరిగాయి. రిఫరీలు, కోచ్‌లు సత్యనారాయణ, త్రిమూర్తులు, రత్నం, గోపాలకృష్ణ, విజయ సింహాద్రి, నవీన్, గణేష్, సాయి, లక్ష్మీనారాయణ, శ్రీను పాల్గొన్నారు.

అత్యాచార బాధితుల గుర్తింపు బహిర్గతం చేయవద్దు

జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి

అమలాపురం టౌన్: అత్యాచారానికి గురైన బాధితుల గుర్తింపు బహిర్గతం చేయడం చట్ట ప్రకారం నేరమని జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదైతే బాధితురాలి పేరు, ఫొటో, కుటుంబ వివరాలు, చిరునామా, ఆమె చదివే పాఠశాల వంటివి బహిర్గతం చేయకూడదని ఆయన సూచించారు. దీనివల్ల బాధిత కుటుంబానికి ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. అలా బాధితురాలి వివరాలను బహిర్గతం చేసే వారు శిక్షార్హులని హెచ్చరించారు. చట్ట విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే ఒక సంవత్సరం వరకూ జైలుశిక్ష పడుతుందని ఎస్పీ వివరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇటీవల ఓ బాలికపై జరిగిన లైంగిక దాడి ఘటనకు సంబంధించి పోలీసులు ఇప్పటికే నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి జ్యూడీషియల్ కస్టడీతో రిమాండ్‌కు పంపించారన్నారు. ఈ కేసును పోలీసులు ఓ క్రమపద్ధతితో శాస్త్రీయంగా దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. ఇదే సమయంలో కొంత మంది బాధితురాలి ఇంటికి వెళ్లి వారి గుర్తింపు బయటపెట్టేలా చేసి అసౌకర్యానికి గురి చేస్తున్నారని, ఇది చట్టరీత్యా నేరమని ఎస్పీ అన్నారు.

స్వామి ఊరేగే.. మది ఉప్పొంగే

- నేత్రపర్వంగా స్వామివార్ల రథోత్సవాలు
- పులకించిన భక్తజనం

సామర్లకోట: హరహరా.. భీమేశ్వరా అంటూ ఆ స్వామిని చూసిన భక్తజనం పులకించింది.. భక్తిపారవశ్యంతో మునిగితేలింది. ఆదివారం సామర్లకోటలోని బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి రథోత్సవం నేత్ర పర్వంగా జరిగింది. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు, ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా ఆలయం నుంచి గాంధీచౌక్ వరకూ తీసుకువచ్చారు. ఆలయ పండితుల వేదమంత్రాల మధ్య స్వామి, అమ్మవార్లను పూలతో అలంకరించి రథంపై ఉంచారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, అయ్యరక కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరీ, ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు, ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, గుణ్ణం చంద్రమౌళిలు రథోత్సవ కమిటీ ఆధ్వర్యంలో గాంధీచౌక్‌లో రథోత్సవాన్ని ప్రారంభించారు. పట్టణ పుర వీధుల నుంచి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, బాణసంచా కాల్పుల మధ్య వేడుక అత్యంత వైభవంగా సాగింది. దారి పొడవునా ఉత్సవమూర్తులను భక్తులు దర్శించుకున్నారు. సోమవారం రాత్రి స్వామివారి శ్రీపుష్పయోగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.



పిఠాపురంలో కుక్కుటేశ్వరస్వామి వారి రథోత్సవం



కుక్కుటేశ్వరస్వామి రథోత్సవంలో భక్తులు



సామర్లకోటలో భీమేశ్వరస్వామి రథోత్సవం

ముగ్ధమనోహరం

పిఠాపురం: గరళకంఠుడి గజ్జెల సవ్వడితో పిఠాపురం పులకించింది. భక్తజనం బారులు తీరి పుర వీధుల్లో నిర్వహించిన ఉమాకుక్కుటేశ్వర స్వామివారి దివ్య రథోత్సవం ఆదివారం రాత్రి కనుల పండువగా జరిగింది. తెల్లవారు జామున పిఠాపురం మహారాజా రాజారావు వెంకటకుమార మహీపతి సూర్యారావు బహుద్దూర్ వారి పేరున ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో లింగోద్భవ పూజలు చేశారు. రాత్రి అధిక సంఖ్యలో విచ్చేసిన భక్త జన సందోహం నడుమ కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీ అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాల అనంతరం రథోత్సవాన్ని ఎమ్మెల్యే పెండెం దొరబాబు ప్రారంభించారు. విశేషంగా అలంకరించిన రథంపై ఉత్సవ విగ్రహాలను వేదపండితులు అధిష్ఠించగా రథోత్సవాన్ని ప్రారంభించారు. పట్టణ మెయిన్ రోడ్డు మీదుగా ఉప్పాడ సెంటర్ వరకూ సాగిన ఉత్సవానికి అశేష భక్త జనవాహిని కదిలివచ్చింది. స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



రథంపై బాలాత్రిపుర సుందరీదేవి, కుమారారామ భీమేశ్వరస్వామి

ఏం జరిగిందో.. ఏమో!



అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన రాజు



పరిశ్రమ వద్ద పిల్లలతో కలిసి రోదిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు



రాజు (ఫైల్)

- పట్టాభి ఆగ్రో పరిశ్రమలో కార్మికుడి మృతి
- యాజమాన్య వైఖరిపై నిరసన

పెద్దాపురం: అసలు ఏం జరిగిందో ఏమో.. ఓ పరిశ్రమలో కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటన స్థానిక వాలుతిమ్మాపురం రోడ్డులోని పట్టాభి ఆగ్రో ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (సైరస్ లోహిత రైస్) పరిశ్రమలో జరిగింది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. సామర్లకోట గణపతినగరం వాటర్ ట్యాంకుల ప్రాంతానికి చెందిన గొరిసెట్టి రాజు (36) శనివారం రాత్రి 8.30 గంటలకు యథావిధిగా ఆ పరిశ్రమలో విధులకు వెళ్లాడు. ఉదయం విధుల నుంచి రావాల్సిన తన భర్త ఇంకా రాలేదని భార్య సత్య అనుకునేలోగా ఓ వ్యక్తి వచ్చి రాజు ఇంటికి వచ్చాడా అంటూ అడిగారు. దీంతో కుటుంబ సభ్యులు ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని ఆరా తీశారు. సీఐటీయూ, జనసేన, ప్రజా సంఘాల నాయకులు వచ్చి రాజు ఆచూకీ తెలపాలంటూ ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఫ్యాక్టరీలో పరిశీలించగా రాజు మహిళల టాయిలెట్స్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండడాన్ని గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ ప్రజా సంఘాలు, కుటుంబ సభ్యులు ఫ్యాక్టరీ గేటు వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. రాత్రి చనిపోతే విషయాన్ని బయటకు పొక్కకుండా దాచి పెట్టి యాజమాన్యం ఆటలాడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ నబీ, ఎస్ఐ సురేష్‌లు ఘటనా స్థలానికి చేరుకుని మృతికి గల కారణాలపై ఆరా తీశారు. మహిళల మరుగుదొడ్లలోకి రాజు ఎందుకు వెళ్లాడు.. అక్కడ గుండెపోటు రావడంతోనే చనిపోయాడా.. లేక వేరే కారణాలేమైనా ఉన్నాయా.. అనే కోణంలో దర్యాప్తు మొదలు పెట్టారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించి పరిశీలించగా బాత్‌రూమ్ నుంచి రాజు పని చేసే స్థలం వరకూ డాగ్ వెళ్లి అక్కడ ఆగిపోయింది. పలు అనుమానాలు రావడంతో కంపెనీ ప్రతినిధులను అదుపులోకి తీసుకుని విచారించారు. మృతుడు రాజుకు భార్య సత్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. రాత్రి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో యాజమాన్యంతో చర్చలు జరిగాయి. ఇందులో మృతుడి కుటుంబానికి రూ.12 లక్షలు ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించింది. దీంతో వారు ఆందోళన విరమించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

క్రైం కార్నర్..

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



మృతుడు చిన్నశ్రీను

కరప: వేములవాడ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. కరప పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కోటనందూరు మండలం బిళ్లనందూరు గ్రామానికి చెందిన మాతిరెడ్డి చిన్నశ్రీను (30) గ్రామ వలంటీర్‌గా పని చేస్తూ తల్లిదండ్రులతో కలసి జీవిస్తున్నాడు. పచ్చ కామెర్లతో బాధపడుతున్న తమ బంధువుకు మందు తీసుకొచ్చేందుకు ఆదివారం ఉదయం బిళ్లనందూరు నుంచి బైక్‌పై బయలుదేరి రామచంద్రపురం మండలం వెల్ల గ్రామానికి వెళ్లాడు. పచ్చ కామెర్ల మందు తీసుకుని తిరుగు ప్రయాణంలో కరప మండలం వేములవాడ, వలసపాకల గ్రామాల మధ్యకు వచ్చేసరికి కాకినాడ నుంచి రామచంద్రపురం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి అతన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ ధ్వంసం కాగా చిన్నశ్రీను తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ ఎస్.రామకృష్ణ తమ సిబ్బందితో ఘటనా స్థలానికెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

కాలువలో మునిగి వ్యక్తి మృతి



మాతా శ్రీను మృతదేహం

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకం కాలువలో స్నానానికి దిగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. రాజమహేంద్రవరం తాడితోటకు చెందిన మాతా శ్రీను, తాత కృష్ణ, పాముల సూరిబాబు, టంగుటూరి కిరణ్, మెల్లిన దుర్గాప్రసాద్, కిరణ్‌లు వేర్వేరు పనులు చేస్తుంటారు. వీరంతా ఆదివారం కావడంతో బైక్‌లపై వేగేశ్వరపురం వచ్చి సరదాగా గడిపి కాలువలోకి స్నానానికి దిగారు. ఇందులో మాతా శ్రీను (30) నీటిలో మునిగిపోయాడు. మిగిలిన స్నేహితులు అతనిని ఒడ్డుపైకి తీసుకు వచ్చారు. అనంతరం 108కు సమాచారం ఇచ్చారు. వెంటనే తాళ్లపూడి పీహెచ్‌సీకి తరలించారు. శ్రీను అప్పటికే మృతి చెందినట్టు వైద్య సిబ్బంది ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతను తాడితోటలో అల్యూమినియం తయారీ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. తాళ్లపూడి ఎస్సై కె.వెంకటరమణ, ఏఎస్ఐ ప్రసాద్ వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

భర్తకు భారం కాకూడదని ఆత్మహత్య

- గోదావరిలో పడి వివాహిత మృతి
- శింగవరంలో విషాదం



అనంతలక్ష్మి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రాజానగరం: తన అనారోగ్యం కారణంగానే భర్త అప్పుల పాలవుతున్నాడని భావించిన ఆ భార్య గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. సీతానగరం మండలం శింగవరంలో ఆదివారం ఈ సంఘటన జరిగింది. దీనికి సంబంధించి హెడ్ కానిస్టేబుల్ లోవకుమార్ కథనం ప్రకారం.. శింగవరానికి చెందిన ముత్తాటి అనంతలక్ష్మి (38)కి వెంకటేశ్వరరావుతో ఇరవై ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇంతవరకూ సంతానం కలగలేదు. ఆమె బీపీ, మధుమేహం వ్యాధుల బారిన పడింది. వైద్యం చేయించడం కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో భర్త తన ద్విచక్ర వాహనాన్ని కూడా అమ్మేశాడు. ఈ విషయం తెలుసుకుని అనంతలక్ష్మి ఆరా తీసింది. వైద్య ఖర్చులతో పాటు కుటుంబ ఖర్చులు కూడా పెరగడంతో అప్పులు చేశానని, వాటిని తీర్చడం కోసం వాహనాన్ని అమ్మక తప్పలేదన్నాడు. దీంతో తన అనారోగ్యం కారణంగా భర్త ఆర్థికంగా నలిగిపోతున్నాడని భావించిన ఆమె శనివారం రాత్రి భర్త ఇంటి వద్ద లేని సమయంలో బయటకు వెళ్లింది. పురుషోత్తపట్నం వద్ద గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం ఉదయం విగతజీవిగా గోదావరిలో తేలడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీతానగరం ఎస్సై శుభోశేఖర్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఏలేశ్వరం: పెద్దనాపల్లిలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్సై జి.సతీష్ తెలిపారు. గ్రామంలోని ఏలేరు కాలువ వద్ద ఆ మృతదేహాన్ని గుర్తించామన్నారు. అతని వయసు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని వివరించారు. 5.5 అడుగుల ఎత్తు, చామనఛాయ రంగులో ఉన్నాడన్నారు. ఒంటిపై నలుపు, ఎరుపు రంగు చొక్కా, నల్ల ఫ్యాంటు ఉన్నాయని, ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచామన్నారు. మరిన్ని వివరాలకు 94409 04835, 94407 96530 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని అన్నారు.

పాదగయ పుష్కరిణిలో వ్యక్తి మృతి

పిఠాపురం: స్థానిక పాదగయ పుష్కరిణిలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి (45) మృతదేహం లభ్యమైనట్లు పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదని అన్నారు. మరిన్ని వివరాల కోసం పిఠాపురం పట్టణ పోలీసులను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు.

వస్త్ర దుకాణంలో చోరీ

రూ.1.44 లక్షల నగదు అపహరణ

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న శ్రీసత్య వస్త్ర దుకాణంలో చోరీ జరిగింది. ఇందులో రూ.1.44 లక్షల నగదు చోరీకి గురైనట్లు హెడ్ కానిస్టేబుల్ జ్యోతిబాబు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు షాపు యజమాని బేతా శివప్రసాద్ ఒక పార్టీ కోసం షాపు పక్క నుంచి వెళుతూ షాపు తెరిచి ఉండటం గమనించాడు. లోనికి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించి ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అమలాపురం నుంచి క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించారు. సీసీ ఫుటేజీ పరిశీలించగా తెల్లవారుజామున 3 నుంచి 4 గంటల మధ్యలో ఇద్దరు యువకులు గునపంతో షాపు షెట్టర్‌కు ఉన్న తాళం పెకలించారు. అదే గునపంతో క్యాష్ కౌంటర్ బద్దలు కొట్టి నగదు ఉన్న బ్యాగ్‌ను పట్టుకుని వెళ్లిపోయినట్లు గుర్తించారు. యజమాని ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ జ్యోతిబాబు తెలిపారు.

ఉత్కంఠగా సీనియర్స్ హాకీ పోటీలు



ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్ జట్ల మధ్య పోటీ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జాతీయ ఉమెన్స్ సీనియర్ హాకీ చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ఉత్కంఠగా జరిగాయి. మొదటి మ్యాచ్ ఒడిశా, రాజస్తాన్ మధ్య జరిగింది. ఒడిశా జట్టు 13–1 స్కోర్‌తో విజయం సాధించింది. క్రీడాకారిణి అనుప బర్ల ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును దక్కించుకుంది. రెండో మ్యాచ్‌లో కర్ణాటక, చండీగఢ్ జట్లు పోటీ పడ్డాయి. ఇందులో 2–1 స్కోర్‌తో కర్ణాటక విజయం సాధించింది. క్రీడాకారిణి పూజా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు పొందింది. మూడో మ్యాచ్‌లో ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్‌లు తలపడ్డాయి. ఛత్తీస్‌గఢ్ 4–1 స్కోర్ తేడాతో విజయం సొంతం చేసుకుంది. క్రీడాకారిణి అంజలి మాతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకుంది. నాలుగో మ్యాచ్‌లో మణిపూర్, మధ్యప్రదేశ్ పోటీపడగా మధ్యప్రదేశ్ విజయం సాధించింది. క్రీడాకారిణి ప్రీతి దుబో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును దక్కించుకుంది. ఐదో మ్యాచ్‌లో బిహార్, అస్సాం జట్లు పోటీ పడగా బిహార్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లను జిల్లా ఒలింపిక్ సంఘు కార్యదర్శి పద్మనాభం, తైక్వాండో సంఘు కార్యదర్శి బి.అర్జునరావు, జిల్లా హాకీ సంఘు సీనియర్ సభ్యుడు బాబ్జి తిలకించారు. హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్ రాయ్, కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి, ట్రెజరర్ పీటర్, టోర్నమెంట్ కోఆర్డినేటర్ వి.రవిరాజు, పరిశీలకుడు భూపేంద్రసింగ్, డైరెక్టర్ మహేష్, విక్రమ్ పర్యవేక్షించారు.

చేతికందివచ్చిన బిడ్డలు లేని లోటు తీరనిది



మృతుల కుటుంబాలను ఓదార్చుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శ

మధురపూడి (కోరుకొండ): చేతికి అందివచ్చిన కొడుకులు లేనిలోటు తీర్చలేనిదని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం దోసకాయలపల్లికి చెందిన ఓలేటి అరవింద్, ఎస్‌కే లుక్మన్, పెద్దిరెడ్డి రాంప్రసాద్‌లు పట్టిసం పుణ్యక్షేత్రం వద్ద గోదావరిలో స్నానానికి దిగి మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల కడుపుకోత తీర్చలేనిదన్నారు. బాధితులను ఓదార్చుతూ ఎమ్మెల్యే రాజా కూడా కన్నీరు పెట్టుకున్నారు. యువకులు ప్రయాదవశాత్తు ఇలా మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ప్రమాదం సంగతి తెలిసిన వెంటనే సంబంధిత మంత్రులు, జిల్లా కలెక్టర్ మాధవీలతతో మాట్లాడి అధికారులను అప్రమత్తం చేసినట్టు, సహాయక చర్యలు నిర్వహించాలని కోరినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి మృతుల కుటుంబాలకు సహకారం అందిస్తానన్నారు. కోరుకొండ జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కోకన్వీనర్ గణేశుల పోసి, రాజానగరం కన్వీనర్ దూలం పెద్ద తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ వెటర్నరీ, ఫిషరీ, పౌల్ట్రీ, డైరీ, గోల్డ్ ఎప్రైజర్, ఆయుర్వేద, ఆక్యుపంక్చర్, ఫైర్ & సేఫ్టీ పారామెడికల్ కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. ఫోన్: 99639 76632, www.bssve.in [V- 1744]

Real Estate

LEASE / RENT

■ 3 Bed room flat for lease/rent office /house (no Monthly rent) in Prakash Nagar near Ladies Club with car parking, west facing ✆ : 83412 16762 [R-1188040]

PLOT FOR SALE

■ మచిలీపట్నంలో కత్తిపూడి ఒంగోలు బైపాస్ తారు రోడ్డు ఆనుకొని 25 ఎకరాలు ఇండిపెండెంట్ హౌస్ 165 గజాల్లో 36 లక్షల్లో కలవు. ఓపెన్ ప్లాట్స్ గజం రూ. 9999/- ✆ 79977 66164 [B-887]

TO-LET

■ RJY, తిలక్ రోడ్‌లో సింగిల్ బెడ్ రూమ్ విత్ కిచెన్‌తో అద్దెకు కలదు. శ్రీరాం పురంలో చంద్రికా విలాసినీ గృహ సముదాయములో ఆధునిక సౌకర్యాలతో 3BHK ఫ్లాట్ అద్దెకు కలదు. 9550753419, 9704222630. [C-789361]

Services

■ We Release your pledged gold బంగారం బ్యాంకుల్లో ప్రైవేట్ సంస్థల్లో తనఖాలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువుతో, తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 [R-5590]

BUSINESS OFFER

■ ఇంటివద్ద నుండే వ్యాపారం (పార్ట్‌టైమ్ & ఫుల్‌టైమ్). ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీలో వెల్‌నెస్ కన్సల్టెంట్‌గా వర్క్ చేయుటకు ఇంట్రస్ట్ ఉన్నవారు సంప్రదించగలరు. అందరూ అర్హులే. ✆ : 93470 63794 [R-5650]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 99 12 72 1888 [B-1197745]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2282]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-786678]

MARRIAGE BUREAU

వధువు కావలెను

■ వరుడికి వధువు కావలెను. ఎత్తు : 5.9, రంగు : ఎరుపు, చదువు : B.Com LLB అడ్వకేటు, వయస్సు: 26 సంవత్సరాలు, కులం : SC మాల, సెల్ : 99634 28522 [P-1226531]

Wanted

■ ఫార్మా, F.M.C.G. హెల్త్‌కేర్ బ్యూటీ, అగ్రికల్చరల్ మార్కెటింగ్ - మీ మండలంలో స్త్రీ, పు ఎగ్జిక్యూటివ్ - 30,000 to 50,000. ఏరియా మేనేజర్. 1,20,000. కంపెనీలో షేర్లు పర్మినెంట్ జాబ్. 91214 54187 [R-1234443]

■ SBCo కంపెనీలో East Godhavari లో పనిచేయుటకు 50 మంది స్త్రీ/పు॥ కావలెను. అర్హత: 10th, Inter, Degree Diploma- P/F శిక్షణ కాలంలో 9000 తరువాత 25000 సంపాదించుకోవచ్చు. ఇంటర్వ్యూ ఈ రోజు రేపు. 9010420209. [WA-6481]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి ₹3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190579]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను. ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, Rmp, Dr, Q:5th- డిగ్రీ. 10-30 వేలు జీతం, భో+రూం ఫ్రీ, Hyd, Ph: 7995374999 [HA-998]

■ ప.గో॥జిల్లా, తణుకు క్లాత్ షోరూమ్ శారీస్ సెక్షన్ నందు అనుభవజ్ఞులైన సేల్స్‌మెన్స్, ఫ్లోర్ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డు కావలెను. సంప్రదించండి : 98855 91188, 90525 81869 [P-2618]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781838]

■ ప్రముఖ బ్యాంక్‌లో జనరల్ షిఫ్ట్ పనిచేయుటకు Male సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 26 రోజులు, ప్రదేశం : రాజమండ్రి, దవళేశ్వరం, జగ్గంపేట, పెద్దాపురం, సామర్లకోట ✆ 91826 46763 [B-914]

■ ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్ మరియు ఫైనాన్స్ అండ్ చిట్‌ఫండ్ కంపెనీలో అకౌంటెంట్స్, సూపర్‌వైజర్స్, రికవరీ ఏజెంట్స్ కావలెను. జీతం: 22000/- ఆపైన, రూమ్ + భోజనం ఫ్రీ. ఫోన్ : 9985784184 [H-778971]

■ ఆకాశ ఎయిర్‌లైన్స్‌లో వర్క్ చేయుటకు ఎయిర్ క్యాబిన్ సూపర్‌వైజర్స్, టీం లీడర్స్, సూపర్‌వైజర్స్, కస్టమర్‌కేర్ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ కావలెను. Qly: 10th-డిగ్రీ, డిప్లొమా, బి.టెక్, జీతం: 23,000/- to 29,000/- రూం + ఫుడ్ ఫ్రీ. వ: 18-35 సం॥. ✆ 88850 39153 [B-762872]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్స్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.